సాక్షి జనగామ

సోమవారం | 25 | నవంబర్ | 2024



ఇక.. అంతరాయానికి చెక్

కోతలు లేకుండా విద్యుత్ సరఫరా చేయడమే లక్ష్యంగా టీజీ ఎన్పీడీసీఎల్ ముందుకెళ్తోంది.

- 8లో▸



న్యాయబద్ధంగా వర్గీకరణ చేపట్టాలి

వర్గీకరణను న్యాయబద్ధంగా చేపట్టాలని ఎల్‌హెచ్‌పీఎస్ జాతీయ అధ్యక్షుడు దాస్ రామ్‌నాయక్ డిమాండ్ చేశారు.

- 8లో▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం 27°/13°

జిల్లాలో ఉదయం ఆహ్లాదకర వాతావరణం ఉంటుంది. మధ్యాహ్నం ఎండ మామూలుగా ఉండి రాత్రి చలి తీవ్రత పెరుగుతుంది.

న్యూస్‌రీల్

నేడు ప్రజావాణి

జనగామ రూరల్: నేడు (సోమవారం) కలెక్టరేట్‌లో ఉదయం ప్రజావాణి నిర్వహించనున్నట్లు కలెక్టర్ రిజ్వాన్ బాషా ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజలు ఈ విషయాన్ని గమనించి కలెక్టరేట్‌లో జరిగే ప్రజావాణిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి



జనగామ రూరల్: విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని డీఈఓ రాము అన్నారు. ఆదివారం మధ్యాహ్న భోజన కార్మికులకు ఫుడ్ కాంపిటీషన్‌ను జిల్లా పరిషత్ బాలికల పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడు జి. శంకర్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి డీఈఓ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. వంట గదిలో ఎలాంటి శుభ్రత పాటించాలి, వంట చేస్తున్న సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వివరించారు. అనంతరం పోటీల్లో పాల్గొని విజేతలైన దేవరుప్పులకు చెందిన సుజాత మొదటి బహుమతి, జనగామకు చెందిన ఎం.రాణి ద్వితీయ, లింగాలఘణపురంకు చెందిన కె. లక్ష్మీకి తృతీయ బహుమతిని అందించారు. ఈ కార్యక్రమంలో గౌతం రాజు, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

జాతీయ స్థాయి కరాటే పోటీలకు ఎంపిక



శ్రీహరిణి

కొడకండ్ల: మండలకేంద్రంలోని టీజీఆర్ఎస్ జేసీ గురుకులంలో ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరం చదువుతున్న బక్కెర శ్రీహరిణి జాతీయ స్థాయి కరాటే పోటీలకు ఎంపికైంది. ఆదివారం పెద్దపల్లి జిల్లా గోదావరిఖనిలో నిర్వహించిన ఎస్‌జీఎఫ్ రాష్ట్ర స్థాయి అండర్ 17 కరాటే ఫైనల్ పోటీల్లో ఆమె నైపుణ్యంతో విజయం సాధించి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైంది. త్వరలో ఢిల్లీలో జరిగే జాతీయ స్థాయి పోటీల్లో ఆమె పాల్గొననుంది. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ తమ్మి దిలీప్‌కుమార్‌తో పాటు అధ్యాపకులు ఆమెను అభినందించారు.

ప్రశాంతంగా ఎన్ఎంఎంఎస్ పరీక్ష


జనగామ: జిల్లా కేంద్రంలోని ధర్మకంచ, రైల్వేస్టేషన్, స్టేషన్‌ఘన్‌పూర్, శివునిపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఆదివారం జరిగిన నేషనల్ మీన్స్ కం మెరిట్ స్కాలర్‌షిప్ (ఎన్ఎంఎంఎస్) పరీక్షకు 627 మంది విద్యార్థులు హాజరయ్యారు. 647 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకోగా 20 మంది గైర్హాజరు కాగా 96.90 శాతం హాజరైనట్లు డీఈఓ రాము తెలిపారు. పరీక్ష ప్రశాంత వాతావరణంలో జరిగిందన్నారు.

నియామక ఉత్తర్వులు త్వరగా ఇవ్వాలి



జనగామ: రాష్ట్రంలో వీఆర్ఏ వారసులకు వెంటనే నియామక ఉత్తర్వులు ఇవ్వాలని వీఆర్ఏ జేఏసీ రాష్ట్ర కన్వీనర్ వంగూరు రాములు డిమాండ్ చేశారు. వీఆర్ఏ వారసుల సంఘం జిల్లా అధ్యక్షుడు చింత శివ ఆధ్వర్యంలో ఆదివారం అదనపు కలెక్టర్ పింకేష్ కుమార్‌కు వినతి పత్రం అందించి, కలెక్టరేట్ ఆవరణలో మాట్లాడారు. రాష్ట్ర వ్యాప్తంగా 61 ఏళ్లు పైబడిన వీఆర్ఏ వారసులు 3,797 మంది ఉండగా, జిల్లాలో 103 మంది ఉన్నట్లు స్పష్టం చేశారు. తమకు న్యాయం జరగాలని 80 రోజుల పోరాటాల ఫలితంగా గత బీఆర్ఎస్ ప్రభుత్వం 81, 85 జీఓ విడుదల చేసినట్లు చెప్పారు. తమ న్యాయమైన హక్కులను పరిష్కరించడంలో గత బీఆర్ఎస్, ప్రస్తుత కాంగ్రెస్ విఫలమైందన్నారు. ప్రజాపాలన సంబురాలకు ముందుగానే తమకు ఇచ్చిన హామీని నెరవేర్చాలని విజ్ఞప్తి చేశారు.

జనగామలో నిలిచిన గోరక్‌పూర్ ఎక్స్‌ప్రెస్



జనగామ: యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరు – జనగామ మండలం పెంబర్తి మధ్య జరుగుతున్న కల్వర్టు పనుల కారణంగా కాజీపేట వైపు నుంచి గోరక్‌పూర్‌కు వెళ్లే ఎక్స్‌ప్రెస్ రైలు జనగామ రైల్వేస్టేషన్‌లో ఆదివారం అరగంట పాటు నిలిచింది. కల్వర్టు పనులకు సంబంధించి విద్యుత్ సరఫరాను నిలిపేయడంతో రైలును జిల్లా రైల్వే స్టేషన్‌లో ఆపేశారు. విద్యుత్‌ను పునరుద్ధరించిన తర్వాత యథావిధిగా రైలు సికింద్రాబాద్ వైపు వెళ్లింది.

గీతన్నలకు 'రక్షణ కిట్టు'

- తాటిచెట్టు నుంచి జారి పడకుండా 'కాటమయ్య కిట్టు'
- అందులో ఆరు రకాల పరికరాలు
- ఐడీ కలిగిన కార్మికులు 13,703 మంది
- ప్రస్తుతం మంజూరైన కిట్లు 684



కాటమయ్య కిట్లను అందిస్తున్న బీసీ వెల్ఫేర్ ఆఫీసర్ రవీందర్

జనగామ: గీత కార్మికుల కుటుంబాలకు 'కాటమయ్య రక్షణ కిట్లు' భరోసా కల్పిస్తాయి. తాటి, ఈత కల్లు గీసేందుకు చెట్టు ఎక్కి దిగే సమయంలో ప్రమాదవశాత్తు జారి పడిపోకుండా తెలంగాణ ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. రాష్ట్రంలో కులవృత్తులకు జీవం పోస్తామని చెప్పిన సీఎం రేవంత్‌రెడ్డి.. ఆ దిశగా అడుగులు వేస్తున్నారు. ఆబ్కారీ శాఖ సంయుక్త భాగస్వామ్యంతో బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యాన జిల్లాల వారీగా ఐడీ కార్డులు పొందిన గీత కార్మికుల జాబితా సేకరించారు. గ్రామాల వారీగా టాడీ కార్పొరేషన్ సొసైటీ ప్రతినిధుల సూచనల మేరకు అర్హత కలిగిన గీత కార్మికులను మొదటి విడతలో ఎంపిక చేశారు.

జిల్లాలో 13,703 ఐడీ కార్మికులు

రాష్ట్రంలో యాదాద్రి భువనగిరి జిల్లా తర్వాత జనగామ జిల్లాలోనే అత్యధికంగా గీత కార్మికులు ఉన్నారు. జిల్లాలో 28,600 కల్లుగీత కార్మిక కుటుంబాలు ఉండగా.. అధికారిక లెక్కల ప్రకారం ఐడీ కార్డు కలిగిన వారు 13,703 మంది ఉన్నట్లు గుర్తించారు. ఇందులో ప్రస్తుతం తాటిచెట్లు ఎక్కేవారు ఎందరు.. కుల వృత్తిని వదిలేసిన వారు ఎందరు ఉన్నారనే దానిపై వివరాలు సేకరిస్తున్నారు.

684 కిట్లు మంజూరు

జిల్లాలోని మూడు నియోజకవర్గాలకు ప్రభుత్వం 684 కాటమయ్య రక్షణ కిట్లను మంజూరీ చేసింది. ఇందులో జనగామకు 200, స్టేషన్‌ఘన్‌పూర్ 284, పాలకుర్తి 200 చొప్పున కిట్లు అందించగా.. వాటిని గీత కార్మికులకు అందజేస్తున్నారు. విడతల వారీగా గీత కార్మికులందరికీ ఈ కిట్లు పంపిణీ చేస్తామని మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రకటించిన విషయం తెలిసిందే. కులవృత్తిని నమ్ముకుని జీవనోపాధి పొందుతున్న గీత కార్మికులు ప్రమాదవశాత్తు చెట్టు పైనుంచి జారి ప్రమాదాల బారిన పడుతున్నారు. శాశ్వత అంగవైకల్యం పొందడంతో పాటు మరణాలు సంభవిస్తున్నాయి. దీంతో ఇంటి పెద్ద దిక్కును కోల్పోయిన బాధిత కుటుంబాలు రోడ్డున పడే పరిస్థితి నెలకొంటున్నది. ఈ క్రమంలో సీఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వం కార్మికుల ఆరోగ్య రక్షణ కోసం కాటమయ్య కిట్లను తయారు చేసి అందిస్తోంది. కిట్టులో ఆరు రకాల పరికరాలు ఉంటాయి. ఇందులో స్లింగ్ బ్యాగు, తాడు, హ్యాండిల్ క్లిప్పులు, లెగ్‌లూప్‌లు ఉంటాయి. కిట్ల వినియోగంపై గీత కార్మికులకు అధికార యంత్రాంగం ముందుగానే శిక్షణ ఇచ్చింది. ఈ కిట్టులోని పరికరాల సహాయంతో చెట్టు ఎక్కిన తర్వాత కార్మికుడు ప్రమాదవశాత్తు కిందకు జారినా కిట్టుకు ఉన్న తాడు చెట్టుకు బిగుసుకుని పైనే ఉండి పోతాడు. కాలికి ధరించిన లెగ్ లూప్ ఆసరాగా కిందిగి దిగే అవకాశం ఉంటుంది.



కాటమయ్య కిట్టులోని వస్తువులు

మూడు దశాబ్దాలుగా గీత వృత్తిలో..



గీత వృత్తిపై 30 ఏళ్లుగా జీవనం సాగిస్తున్నాను. 2000 సంవత్సరంలో చెట్టు ఎక్కి కల్లుగీసుకుని కిందకు దిగే సమయంలో ప్రమాదవశాత్తు జారి పడ్డాను. వెన్నుపూసకు తీవ్ర గాయం కావడంతో చెట్టు ఎక్కలేకపోయా. ప్రభుత్వం అందించే కాటమయ్య కిట్ల ఎంతో ఉపయోగం.

– బైరగోని వెంకటయ్య, బసిరెడ్డిపల్లి, బచ్చన్నపేట

గీత కార్మికులకు రక్ష



కాటమయ్య రక్షణ కిట్టు గీత కార్మికులకు రక్షణగా నిలుస్తుంది. ఈత, తాటికల్లు గీసే సమయంలో చెట్టు పైనుంచి జారి పడిపోకుండా ఈ కిట్టు ఉపయోగపడుతుంది. చెట్టు ఎక్కే ప్రతీ కార్మికుడికి కాటమయ్య కిట్టు అందజేయాలి.

– బసవగాని మహేందర్, సిరిపురం, కేజీకేఎస్ లింగాలగణపురం అధ్యక్షుడు

భరోసా లభిస్తుంది..



కాటమయ్య కిట్లు గీత కార్మికుల కుటుంబాలకు పెద్ద భరోసా. ఇంటి నుంచి బయలుదేరిన యజమాని క్షేమంగా వస్తారనే నమ్మకం కలుగుతుంది. పదహారేళ్ల నుంచి చెట్టు ఎక్కుతూ కల్లు అమ్ముకుంటున్నాను. కిట్టు సాయంతో రోజూ నాలుగు చెట్లు ఎక్క గలుగుతాను.

– జాగీరు పరశురాములు, గీత కార్మికుడు, తరిగొప్పుల

దివాళాకోరు రాజకీయాలు మానుకోవాలి

- కేటీఆర్, హరీశ్‌రావులకు ఎమ్మెల్యే కడియం హితవు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కడియం శ్రీహరి

స్టేషన్‌ఘన్‌పూర్: బీఆర్ఎస్ నేతలు కేటీఆర్, హరీశ్‌రావు దివాళాకోరు రాజకీయాలు మానుకోవాలని స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి అన్నారు. ఘన్‌పూర్ నియోజకవర్గంలో రూ.18 కోట్లతో చేపట్టనున్న అభివృద్ధి పనులకు సంబంధించి స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆదివారం ప్రొసీడింగ్స్ కాపీలను ఎమ్మెల్యే అందించారు. అనంతరం విలేకరులతో శ్రీహరి మాట్లాడుతూ.. రాష్ట్రంలో బీఆర్ఎస్ నాయకులు అధికారంలో కోల్పోయిన ఏడాది లోపే అక్కసుతో దివాళాకోరు రాజకీయాలు చేస్తున్నారని విమర్శించారు. రాష్ట్రంలో ధాన్యం కొనుగోళ్లు జరగడం లేదని, రైతులకు బోనస్ అందడం లేదని హరీశ్‌రావు తప్పుడు వ్యాఖ్యలతో ప్రజలను పక్కదోవ పట్టిస్తున్నారని అన్నారు. జనగామ జిల్లాకు వస్తే ధాన్యం కొనుగోళ్లు జరుగుతున్నాయా, బోనస్ అందిస్తున్నారా అనే విషయాన్ని ప్రత్యక్షంగా నిరూపిస్తామని సవాల్ చేశారు. బీఆర్ఎస్, బీజేపీ తదితర ప్రతిపక్షాలు వీలైతే అభివృద్ధిలో భాగస్వాములు కావాలని, ప్రజలను అయోమయానికి గురిచేసే ప్రయత్నాలు చేయవద్దని హితవు పలికారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు జూలుకుంట్ల శిరీష్‌రెడ్డి, ఏఎంసీ చైర్మన్ జూలుకుంట్ల లావణ్య, వైస్ చైర్మన్ నూకల ఐలయ్య, నాయకులు సీహెచ్.నరేందర్‌రెడ్డి, మారుజోడు రాంబాబు, జగదీష్‌రెడ్డి, లింగాజీ, దిలీప్‌రెడ్డి, గుర్రం ఫాతికుమార్, కొలిపాక సతీష్, చిగురు సరిత, బొల్లు లక్ష్మీ, జ్యోతిరెడ్డి, తోట సత్యం తదితరులు పాల్గొన్నారు.

బ్యాంకు పేరిట వచ్చే లింకులను ఓపెన్ చేయొద్దు

- ఎస్‌బీఐ వరంగల్ రూరల్ రీజినల్ మేనేజర్ అబ్దుల్ రహీం



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న అబ్దుల్ రహీం, తదితరులు

జనగామ: బ్యాంకుల పేరిట వాట్సాప్‌కు వచ్చే లింకులను ఓపెన్ చేయొద్దని ఎస్‌బీఐ వరంగల్ రూరల్ రీజినల్ మేనేజర్ షేక్ అబ్దుల్ రహీం అన్నారు. జిల్లా కేంద్రంలోని బతుకమ్మకుంటలో ఆదివారం సైబర్ మోసాలపై ఖాతాదారులతో పాటు ప్రజలకు అవగాహన కల్పించారు. వాట్సాప్, టెక్స్ మెసేజ్ ద్వారా ఫోన్‌లకు వచ్చే లింకులను ఓపెన్ చేసి ఇబ్బంది పడొద్దన్నారు. బ్యాంకు అధికారుల పేరిట ఎవరైనా ఫోన్ చేసి ఓటీపీ అడిగితే స్పందించవద్దన్నారు. ఒక వేళ ఖాతా నుంచి డబ్బులు డ్రా అయినట్లు గుర్తించిన గంట లోపు 1930 టోల్‌ఫ్రీ నంబర్‌కు ఫోన్ చేస్తే, నగదు డ్రా కాకుండా చూసే అవకాశం ఉంటుందన్నారు. అనంతరం సైబర్ మోసాలపై వాల్ పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో చీఫ్ మేనేజర్ రామకృష్ణ, బీఎం గుగులోతు రమేష్ తదితరులు పాల్గొన్నారు.

శైవ క్షేత్రాలకు ప్రత్యేక బస్సు



జనగామ: పవిత్రమైన కార్తీక పర్వదినాన్ని పురస్కరించుకుని జనగామ ఆర్టీసీ డిపో నుంచి ఆదివారం రాత్రి శైవ క్షేత్రాలకు ప్రత్యేక బస్సు సర్వీసు బయలుదేరగా డిపో మేనేజర్ ఎస్.స్వాతి జెండా ఊపి ప్రారంభించారు. డిలక్స్ బస్సులో పంచారామాలైన అమరావతి, భీమవరం, పాలకొల్లు, ద్రాక్షారామం, సామర్లకోట పుణ్యక్షేత్రాల్లోని దైవ దర్శన కోసం 40 మంది భక్తులు బయలు దేరారు. భక్తుల సౌకర్యార్థం ఆర్టీసీ సంస్థ యాత్ర స్పెషల్ సర్వీసులను ప్రారంభించిందని, భక్తులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

ఆన్‌లైన్ నమోదు కీలకం

- డోర్‌లాక్, వలస వెళ్లిన వారి వివరాలు ఫోన్ కాల్ ద్వారా సేకరించాలి
- వీసీలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క




వీసీలో మాట్లాడుతున్న కలెక్టర్ రిజ్వాన్ బాషా

జనగామ రూరల్: సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే చివరి దశకు చేరుకుందని, సర్వే డేటా ఆన్‌లైన్ నమోదు కీలకమైందని, ఎలాంటి పొరపాట్లకు ఆస్కారం లేకుండా నిర్వహించాలని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అన్నారు. ఆదివారం జార్ఖండ్ రాజధాని రాంచి నుంచి సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేపై వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఉప ముఖ్యమంత్రి మాట్లాడుతూ సర్వే దశలో పట్టణ ప్రాంతాల్లో డోర్ లాక్, ఇంటి వద్ద అందుబాటులో లేని వారి వివరాలను ఫోన్ కాల్ చేసి వివరాలను తెలుసుకోవాలన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో వలస వెళ్లిన వారి వివరాలను జాగ్రత్తగా క్రమబద్ధరీకరించుకోవాలన్నారు. అలాగే పాఠశాలలో ఫుడ్ పాయిజన్ కేసులు నమోదవుతున్నాయని, ఏ పాఠశాలలో ఆహారం, పరిశుభ్రతపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. అనంతరం కలెక్టర్ రిజ్వాన్ బాషా మాట్లాడుతూ జిల్లాలో హౌస్ లిస్టింగ్ ప్రకారం సర్వే పూర్తయిందని, ఇంకనూ ఎవరైన తమ కుటుంబ వివరాలు ఇవ్వాల్సి ఉంటే గ్రామంలో అయితే పంచాయతీ సెక్రటరీ, మున్సిపాలిటీలో వార్డు ఆఫీసర్‌కు లేదా 76739 71836, 84668 51968, 99481 87334 నంబర్లకు ఫోన్ చేసి వివరాలను ఇవ్వాలన్నారు. జిల్లా, మండల స్థాయి అధికారుల పర్యవేక్షణలో సర్వే వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు అయ్యేలా తగు ఆదేశాలు జారీ చేశామన్నారు. జిల్లాలోని అన్ని హాస్టళ్లలో మెనూ ప్రకారం పోషక విలువలతో కూడిన పౌష్టికాహారం అందేలా తగు జాగ్రత్తలు తీసుకుంటామన్నారు.

సభ్యత్వ నమోదులో ఆదర్శంగా నిలుపుదాం

- 'గోపా' జిల్లా అధ్యక్షుడు ఆంజనేయులుగౌడ్



సభ్యత్వాన్ని అందిస్తున్న ఆంజనేయులు

కొడకండ్ల: గౌడ అఫిషియల్ అండ్ ప్రొఫెషనల్ అసోసియేషన్ (గోపా) ఆధ్వర్యంలో అధిక సభ్యత్వాలతో జిల్లాను ఆదర్శంగా నిలుపుదామని గోపా జిల్లా అధ్యక్షుడు మేకపోతుల ఆంజనేయులుగౌడ్ అన్నారు. ఆదివారం మండలకేంద్రంలో మండల అధ్యక్షుడు కారుపోతుల దయానంద్‌గౌడ్ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. రాజ్యాధికారమే లక్ష్యంగా గోపా సభ్యులంతా పనిచేయాలని, కులగణన తర్వాత త్వరలో జరగబోవు స్థానిక సంస్థల ఎన్నికల్లో గౌడ కులస్తులు అధిక ప్రాధాన్యం పొందేలా ప్రతి ఒక్కరు కృషి చేయాలని కోరారు. డిసెంబర్ 1న హైదరాబాద్ సంజీవయ్య పార్క్‌లో జరిగే రాష్ట్ర స్థాయి సదస్సు, కార్తీక వనభోజనాల కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. రెండోసారి గోపా మండల అధ్యక్షుడిగా కారుపోతుల దయానంద్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సమావేశంలో నాయకులు దేశగాని నాగరాజు, క్రాంతికుమార్, ప్రభాకర్, బాలరాజు, సోమన్న, రంగయ్య, రాజు, సతీష్, రజిత, శారద, శ్రీనివాస్, మధు, శోభన్ తదితరులు పాల్గొన్నారు.

పండుటాకుల పడిగాపులు



జీపీ కార్యాలయం వద్ద పింఛన్ కోసం ఎదురుచూస్తున్న వృద్ధులు, తదితరులు

స్టేషన్‌ఘన్‌పూర్: ఘన్‌పూర్ డివిజన్ కేంద్రానికి చెందిన వృద్ధులు, దివ్యాంగులు పింఛన్ల కోసం రెండు రోజులుగా గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద గంటల తరబడి పడిగాపులు పడుతూ తీవ్ర అవస్థలకు గురవుతున్నారు. వివరాలు ఇలా ఉన్నాయి. స్టేషన్‌ఘన్‌పూర్‌లో 1,200 మందికి పైగా ప్రభుత్వ పింఛన్ లబ్ధిదారులున్నారు. గతంలో ఘన్‌పూర్‌కు చెందిన ఓ వ్యక్తి ఏరియాలు, తేదీల వారీగా పింఛన్లు పంపిణీ చేసేవారు. ఇటీవల పోస్టాఫీస్ అధికారులు స్థానిక వ్యక్తిని కాదని చిల్పూరు మండలం చిన్నపెండ్యాలకు చెందిన బీపీఎంతో పింఛన్లు పంపిణీ చేయిస్తున్నారు. దీంతో ఆయన సమయపాలన పాటించకపోవడం, ఏరియాల వారీగా కాకుండా ఒకే చోట పంపిణీ చేస్తుండటంతో లబ్ధిదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పాత పద్ధతిలోనే ఏరియాల వారీగా పింఛన్లు పంపిణీ చేయాలని, ఈ విషయమై పోస్టాఫీసు అధికారులు స్పందించి పండుటాకులకు న్యాయం చేయాలని కోరుతున్నారు.

ఎఫ్ఆర్ఓ కార్యాలయం తరలింపు..!

- ఎనిమిదేళ్లుగా ఘన్‌పూర్‌లోనే..
- అద్దె భవనం కావడమే కారణం
- ఏడాదిన్నరగా అందని నిధులు
- ఇక్కడే ఉంచాలని ప్రజల డిమాండ్

స్టేషన్‌ఘన్‌పూర్: డివిజన్ కేంద్రమైన ఘన్‌పూర్‌లోని ఫారెస్ట్ రేంజ్ కార్యాలయం జిల్లా కేంద్రానికి తరలిపోతున్నట్లు విశ్వసనీయ సమాచారం. కార్యాలయాన్ని ఇక్కడే ఉంచాలని, తరలిస్తే రైతులకు, అన్ని వర్గాల ప్రజలకు అసౌకర్యంగా ఉంటుందని వివిధ రాజకీయ పార్టీల నాయకులు పేర్కొంటున్నారు. స్టేషన్‌ఘన్‌పూర్, జఫర్‌గఢ్, చిల్పూరు, కొడకండ్ల, పాలకుర్తి తదితర మండలాలకు వర్తించే ఘన్‌పూర్ ఎఫ్ఆర్ఓ కార్యాలయం మొదట హనుమకొండలో కొంత కాలం నడిపించారు. అనంతరం అటవీశాఖ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు 2016లో ఘన్‌పూర్‌లో ఏర్పాటు చేశారు. ప్రస్తుతం కార్యాలయంలో ఎఫ్ఆర్ఓతో పాటు ఎఫ్‌డీఆర్ఓ, ఎఫ్ఎస్ఓతోపాటు ముగ్గురు ఎఫ్‌బీఓలు, నలుగురు కాంట్రాక్టు సిబ్బంది మొత్తం పదిమంది విధులు నిర్వహిస్తున్నారు. స్థానిక బస్టాండ్ సమీపాన ఓ అద్దె భవనంలో ఎఫ్ఆర్ఓ కార్యాలయం నిర్వహిస్తున్నారు. అద్దె నెలకు రూ.7,500 కాగా ఏడాదిన్నరగా ప్రభుత్వం నుంచి డబ్బులు రాకపోవడంతో ఎఫ్ఆర్ఓ, ఇతర సిబ్బందే చెల్లిస్తున్నారు. ప్రస్తుత కార్యాలయ భవనానికి 2025 మార్చి వరకు అగ్రిమెంట్ ఉన్నప్పటికీ ఏడాదిన్నరగా ప్రభుత్వం నుంచి అద్దె డబ్బులు రాకపోవడంతో ఇక్కడ నుంచి కార్యాలయాన్ని మార్చాలని ఎఫ్ఆర్ఓ ఆలోచిస్తున్నారు. ఈ క్రమంలో జనగామలోని అటవీశాఖకు చెందిన ప్రభుత్వ భవనంలోకి తరలించే ప్రయత్నం చేస్తున్నారు. ఇప్పటికే ఫైళ్లు, రిజిస్టర్లు, సామగ్రి సర్ది పెట్టారు. రేపో, మాపో జనగామకు తరలించేందుకు ఏర్పాట్లు చేశారు. అయితే కార్యాలయం ఘన్‌పూర్‌లోనే ఉండాలని కాంగ్రెస్ పార్టీతో పాటు ప్రతిపక్ష పార్టీల నాయకులు కోరుతున్నారు.



ఘన్‌పూర్‌లో ఎఫ్ఆర్ఓ కార్యాలయం నిర్వహిస్తున్న భవనం




కార్యాలయాన్ని తరలించేందుకు రికార్డులను మూటలు కట్టిన దృశ్యం

కార్యాలయం మార్చితే మళ్లీ కష్టాలు

ఎఫ్ఆర్ఓ కార్యాలయాన్ని జిల్లా కేంద్రానికి మారిస్తే ప్రజలకు మళ్లీ కష్టాలు ఎదురుకానున్నాయి. ఈ కార్యాలయం పరిధిలోని ఐదు మండలాల పరిధి గ్రామాల రైతులు ఏదైనా పని కోసం జనగామకు వెళ్లాల్సి వస్తుంది. ప్రధానంగా వ్యవసాయ క్షేత్రాల్లోని చెట్లను తొలగించాడికి అటవీశాఖ అధికారుల అనుమతులు అవసరం. అలాగే ఘన్‌పూర్, జఫర్‌గఢ్, చిల్పూరు మండలాల్లో గుట్టలు, అటవీప్రాంతం ఉండగా ఎలుగుంట్లు తదితర వన్యప్రాణులు తరచూ వస్తుంటాయి. ఏదైనా సంఘటన జరిగితే కార్యాలయం అందుబాటులో ఉంటేనే బాగుంటుంది. స్థానిక ఎమ్మెల్యే కడియం శ్రీహరి ఘన్‌పూర్‌లో సమీకృత భవన నిర్మాణానికి కృషి చేస్తుంటే.. ఇక్కడి కార్యాలయాన్ని జనగామకు తరలించే ప్రయత్నం చేయడం చర్చనీయాంశంగా మారింది.


కార్యాలయం ఇక్కడే ఉంచాలి



ఎఫ్ఆర్ఓ కార్యాలయాన్ని స్టేషన్‌ఘన్‌పూర్‌లోనే ఉంచాలి. డివిజన్ పరిధి పలు మండలాల్లో గుట్టలు, అటవీప్రాంతం అధికంగా ఉంది. రైతులు ఏదైనా పనులకు అనుమతులు తీసుకోవాలన్నా, ఏదైనా సంఘటన జరిగినా సమాచారం అందించేందుకు స్థానికంగా ఆఫీస్ ఉంటే అనువుగా ఉంటుంది. కార్యాలయాన్ని తరలిస్తే ఆందోళనలు చేస్తాం.

– సాదం రమేష్, జీఎంపీఎస్ జిల్లా కార్యదర్శి

తరలింపు ఆలోచనను మానుకోవాలి..



ఎఫ్ఆర్ఓ కార్యాలయాన్ని ఘన్‌పూర్ నుంచి తరలించొద్దు. డివిజన్‌కేంద్రంలోనే ప్రజలకు అనువుగా ఏర్పాటు చేయాలి. ఎమ్మెల్యే కడియం శ్రీహరి అన్ని ప్రభుత్వ కార్యాలయాలు ఒకే చోట ఉండేలా రెవెన్యూ డివిజనల్ ఆఫీస్ కాంప్లెక్స్ నిర్మాణానికి కృషి చేస్తున్నారు. అటవీశాఖ ఉన్నతాధికారులు తరలింపు ఆలోచనను మానుకోవాలి.

– కొలిపాక సతీష్, కాంగ్రెస్ జిల్లా నాయకుడు

అద్దె డబ్బులు రావడం లేదు

ఎఫ్ఆర్ఓ కార్యాలయం ఘన్‌పూర్‌లో అద్దె భవనంలో నిర్వహిస్తున్నాం. రెండు సంవత్సరాలుగా ప్రభుత్వం నుంచి అద్దెకు సంబంధించిన డబ్బులు రావడం లేదు. దీంతో నిర్వహణ భారంగా మారింది. ఇక్కడే ప్రభుత్వ భవనాన్ని ఏర్పాటు చేస్తే తప్పనిసరిగా ఘన్‌పూర్‌లోనే నిర్వహిస్తాం.

– మురళీధర్, ఎఫ్ఆర్ఓ

నేడు పాలకుర్తి మార్కెట్ కమిటీ ప్రమాణ స్వీకారం

పాలకుర్తి: పాలకుర్తి ఐలమ్మ వ్యవసాయ మార్కెట్ కమిటీ నూతన పాలకవర్గ ప్రమాణస్వీకార కార్యక్రమం నేడు (సోమవారం) మండల కేంద్రంలో జరగనుందని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు రాపాక సత్యనారాయణ, మండల అధ్యక్షుడు గిరగాని కుమారస్వామి ఆదివానం ఒక ప్రకటనలో తెలిపారు. వ్యవసాయ మార్కెట్ కమిటీ ఆవరణలో ఉదయం 10.30 గంటలకు జరిగే కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి, ప్రభుత్వ విప్, డోర్నకల్ ఎమ్మెల్యే రాంచంద్రునాయక్, ఎంపీ కడియం కావ్య, మహబూబాబాద్ ఎమ్మెల్యే మురళీనాయక్, కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఝాన్సీరెడ్డి, తదితరులు పాల్గొంటారన్నారు. చైర్‌పర్సన్‌గా లావుడ్య మంజుల, వైస్ చైర్మన్‌గా అనుముల మల్లారెడ్డి, డైరెక్టర్లు ప్రమాణస్వీకారం చేస్తారని ఆయన తెలిపారు.

డీఈఓ బదిలీపై సర్వత్రా ఆందోళన

- కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లిన ఉపాధ్యాయ సంఘాలు
- ఉత్తర్వులు రద్దు చేయాలని డిమాండ్

జనగామ: రాష్ట్ర వ్యాప్తంగా వచ్చే ఏడాది జరగనున్న పదో తరగతి వార్షిక పరీక్షల్లో జిల్లాను నంబర్‌వన్‌గా నిలిపించేందుకు కష్టపడుతున్న సమయంలో డీఈఓ బదిలీపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. కలెక్టర్ రిజ్వాన్ బాషా సహకారంతో డీఈఓ రాము ఆధ్వర్యంలో టెన్త్ విద్యార్థులకు స్పెషల్ తరగతులు తీసుకుంటూ ఒకటో ర్యాంకు దిశగా అడుగులు వేస్తున్నారు. ప్రభుత్వ, ప్రైవేట్ బడుల్లో ప్రత్యేక తరగతులపై దృష్టి సారిస్తున్న సమయంలో డీఈఓను జగిత్యాలకు బదిలీ చేస్తూ ఉత్తర్వులు వెలువడడంతో ర్యాంకుపై నీలినీడలు ఏర్పడే అవకాశం ఉంది. దీంతో డీఈఓ బదిలీని వెంటనే ఆపాలని పలు ఉపాధ్యాయ సంఘాలతో పాటు ఆయా సంఘాల ప్రతినిధులు కలెక్టర్‌ను కలిసి వినతి చేస్తున్నారు. జిల్లాలో 180 ప్రభుత్వ, ప్రైవేట్ ఉన్నత పాఠశాలలు ఉండగా, 6,600 మంది విద్యార్థులు పది పరీక్షలు రాయనున్నారు. వార్షిక పరీక్షల్లో రాష్ట్రంలోనే మొదటి స్థానం నిలిచేలా ఉదయం 8 నుంచి 9 గంటల వరకు సబ్జెక్టుల వారీగా విద్యార్థులకు ప్రత్యేక తరగతులు తీసుకుంటున్నారు. ఈ నేపథ్యంలో డీఈఓ బదిలీ స్పెషల్ తరగతులు, నంబర్ వన్ ర్యాంకుపై పడే అవకాశం ఉందని ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులు కలెక్టర్ దృష్టికి తీసుకు వెళ్లినట్లు సమాచారం. బదిలీని వెంటనే నిలుపుదల చేసి, పదవ తరగతి వార్షిక పరీక్షలపై మరింత దృష్టి సారించేలా ప్రభుత్వం సహకారం అందించాలని కోరుతున్నారు.

క్లుప్తంగా

ఆర్థిక ఇబ్బందులతో పెయింటర్ ఆత్మహత్య


బాలరాజు(ఫైల్)

ఐనవోలు : ఆర్థిక ఇబ్బందులు తాళలేక పెయింటర్ ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన మండలంలోని కొండపర్తిలో ఆదివారం చోటుచేసుకుంది. ఎస్సై పస్తం శ్రీనివాస్ తెలిపిన కథనం ప్రకారం.. మాచర్ల బాలరాజు (48) పెయింటింగ్ పనిచేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. కుల వృత్తితో వచ్చే ఆదాయం సరిపోక పోవడంతో కుటుంబ పోషణకు అప్పులు చేశాడు. దీంతో ఆర్థిక ఇబ్బందులు తలెత్తడంతో గతంలో తన కున్న భూమిని అమ్మి కొంత మేర అప్పులు తీర్చాడు. మళ్లీ కుటుంబ నిర్వహణకు అప్పులు చేయగా తీర్చే మార్గం లేదని భార్యతో చెప్పుకుంటూ తరచూ బాధపడుతుండేవాడు. ఈ క్రమంలో శనివారం మధ్యాహ్నం ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాలేదు. సాయంత్రమైనా ఇంటికి రాకపోవడంతో భార్య, కూతురు కలిసి వెతకగా ఆచూకీ లభించలేదు. ఆదివారం ఉదయం గ్రామంలోని చెట్టుకు బాలరాజు ఉరేసుకుని కనిపించాడు. కుటుంబ సభ్యులు అక్కడికి వెళ్లి చూడగా అప్పటికే మృతిచెందాడు. ఘటనా స్థలానికి పోలీసులు చేరుకుని పోస్టుమార్టం నిమిత్తం ఎంజీఎం తరలించారు. మృతుడికి భార్య శ్రీలత, కూతురు అఖిల ఉన్నారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పస్తం శ్రీనివాస్ తెలిపారు.

కంటి చికిత్స కోసం వెళ్లి.. కనిపించని లోకాలకు

- ఆస్పత్రిలో చిన్నారి మృతి
- శోకసంద్రంలో కుటుంబీకులు


హన్విక(ఫైల్)

చిన్నగూడూరు: కంటి చికిత్స కోసం వెళ్లిన ఓ చిన్నారి కనిపించని లోకాలకు తరలింది. వైద్యులు మోతాదుకు మించి అనస్థిషియా (మత్తు మందు) ఇవ్వడంతో అపస్మారక స్థితిలోకి వెళ్లి మృతి చెందిందని బంధువులు ఆరోపించారు. వారి కథనం ప్రకారం.. మహబూబాబాద్ జిల్లా చిన్నగూడూరు మండలం ఉగ్గంపల్లి గ్రామానికి చెందిన రవి, మౌనిక దంపతులు కొన్నేళ్లుగా హైదరాబాద్‌లోని పటాన్‌చెరులో నివాసముంటున్నారు. నాలుగు రోజుల క్రితం తమ కుమార్తె హన్విక(6) ఆడుకుంటున్న సమయంలో కంటిలో కర్ర ముక్క గుచ్చుకుంది. దీంతో వైద్యం కోసం హైదరాబాద్‌లోని హబ్సిగూడ ప్రైవేట్ కంటి ఆస్పత్రికి తరలించారు. అక్కడ వైద్యులు మోతాదుకు మించి మత్తు మందు ఇవ్వడంతో అపస్మారక స్థితిలో వెళ్లిన చిన్నారి శుక్రవారం మృతి చెందింది. దీంతో ఆడుతూ పాడుతూ అల్లరి చేస్తున్న తమ గారాల పట్టీ ఒక్కసారిగా విగతజీవిగా పడి ఉండడం చూసి తల్లిదండ్రులు గుండెలవిసేలా రోదించారు. చిన్నారి మృతదేహాన్ని ఆదివారం స్వగ్రామం ఉగ్గంపల్లికి తీసుకొచ్చారు. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే రెడ్యానాయక్.. చిన్నారి మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు.

ఇక.. అంతరాయానికి చెక్

కోతలు లేకుండా విద్యుత్ సబ్‌స్టేషన్ల నిర్వహణ

- మరమ్మతుల సమయంలో నో పవర్ కట్
- ప్రత్యామ్నాయ విద్యుత్ లైన్లు ఏర్పాటు
- హర్షం వ్యక్తం చేస్తున్న వినియోగదారులు

హన్మకొండ : కోతలు లేకుండా విద్యుత్ సరఫరా చేయడమే లక్ష్యంగా టీజీ ఎన్పీడీసీఎల్ ముందుకెళ్తోంది. ఇందులో భాగంగా సబ్ స్టేషన్‌ల నిర్వహణ, వాటి సామర్థ్యం పెంపునకు చేపట్టిన పనుల సందర్భంగా విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నారు. ప్రతి సబ్‌స్టేషన్‌కు ప్రత్యామ్నాయ విద్యుత్ లైన్లు వేశారు. మిగతా వాటికి పనులు శరవేగంగా జరుగుతున్నాయి. గతంలో సబ్ స్టేషన్ నెలవారీ నిర్వహణ (మరమ్మతు) చేసిన క్రమంలో 2 నుంచి 4 గంటల వరకు ఆ సబ్ స్టేషన్ పరిధిలో విద్యుత్ నిలిపి చేసేవారు. అదే విధంగా విద్యుత్ సబ్‌స్టేషన్ సామర్థ్యం పెంపునకు చేపట్టిన పనులు సందర్భంగా రెండు, మూడు రోజులు పగలంతా విద్యుత్ సరఫరా నిలిపి చేసేవారు. ఈ సమస్యను అధిగమించేందుకు, విద్యుత్ సరఫరాలో అంతరాయాలు నివారించేందుకు టీజీ ఎన్పీడీసీఎల్ ప్రత్యామ్నాయ విద్యుత్ లైన్లు వేసింది. దీంతో విద్యుత్ అంతరాయాలు తగ్గాయి. కాగా, శనివారం వరంగల్ సర్కిల్ పరిధిలోని గొర్రెకుంట విద్యుత్ సబ్ స్టేషన్ నిర్వహణ పనులు చేశారు. అయినా ఈ సబ్‌స్టేషన్ పరిధిలోని వినియోగదారులకు విద్యుత్ సరఫరా అందించారు. ఇతర సబ్‌స్టేషన్ల నుంచి ఫీడర్‌ల వారీగా విద్యుత్ సరఫరా చేసి అంతరాయాలను నివారించారు.

సబ్‌స్టేషన్ల సామర్థ్యం పెంపు..

గొర్రెకుంట సబ్ స్టేషన్ పరిధిలోని 11 కేవీ లైన్‌లో 10 ఏబీ స్విచ్‌లు ఏర్పాటు చేసి ఇతర సబ్‌స్టేషన్‌ల ద్వారా విద్యుత్ అందించారు. ఈ సబ్‌స్టేషన్ ఇండస్ట్రీయల్ ప్రాంతంలో ఉంది. ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా పరిశ్రమలకు ఎలాంటి ఆటంకాలు లేకుండా నిరంతరాయంగా విద్యుత్ అందించారు. దీంతో పాటు హనుమకొండ సర్కిల్ పరిధిలో వేసవి డిమాండ్‌ను తట్టుకునేందుకు ముందు జాగ్రత్త చర్యలో భాగంగా సబ్‌స్టేషన్‌ల సామర్థ్యాన్ని పెంచుతున్నారు. ఇటీవల హనుమకొండ నక్కలగుట్ట, యాదవ నగర్‌ల సబ్ స్టేషన్‌ల సామర్థ్యాన్ని పెంచారు. రెండు నుంచి మూడు రోజుల పాటు జరిగే ఈ పనులతో మామూలుగానైతే విద్యుత్ సరఫరా పూర్తిగా నిలిపివేయాల్సి ఉంటుంది. ఈ సబ్ స్టేషన్ పరిధిలోని వినియోగదారులకు ఇతర సబ్‌స్టేషన్‌లకు అనుసంధానంగా వేసిన ప్రత్యామ్నాయ లైన్లు వేయడం ద్వారా ఎలాంటి అంతరాలు లేకుండా విద్యుత్ సరఫరా చేశారు. దీంతో ఎలాంటి విద్యుత్ కోతలు లేకుండానే ఇటు సబ్‌స్టేషన్‌ల సామర్థ్యం పెరిగింది. అటు వినియోగదారులకు నిరంతరాయంగా విద్యుత్ సరఫరా జరిగింది. ఈ విధానం అమలుపై వినియోగదారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. గొర్రెకుంట సబ్‌స్టేషన్ మరమ్మతులు చేసినా ఎలాంటి అంతరాయాలు లేకుండా పరిశ్రమలకు విద్యుత్ సరఫరా చేయడంపై చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు రవీందర్ రెడ్డి, కాటన్ అసోసియేషన్ అధ్యక్షుడు వీరారావు గొర్రెకుంటలో విద్యుత్ సబ్ స్టేషన్‌ను సందర్శించి విద్యుత్ అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు.


హనుమకొండలోని యాదవనగర్‌లో సబ్‌స్టేషన్ సామర్థ్యం పెంపులో భాగంగా ఏర్పాటు చేసిన పవర్‌ట్రాన్స్‌ఫార్మర్

అంతరాయాలు లేని విద్యుత్ సరఫరా లక్ష్యం..



వినియోగదారులకు అంతరాయాలు లేని విద్యుత్ సరఫరా లక్ష్యంగా ఎన్పీడీసీఎల్ యాజమాన్యం అనేక చర్యలు తీసుకుంటుంది. సీఎండీ కర్నాటి వరుణ్ రెడ్డి విద్యుత్ కోతలు తగ్గించడంపై ప్రత్యేక దృష్టి సారించారు. సీఎండీ ఆదేశాలు, సూచనల మేరకు వినియోగదారులకు ఆటంకాలు లేకుండా విద్యుత్ సరఫరా చేస్తున్నాం.

– శెంకేశి మల్లికార్జున్, వరంగల్ టౌన్ డీఈ

అందుబాటులోకి ప్రత్యామ్నాయ విద్యుత్ లైన్లు..



వినియోగదారులకు విద్యుత్ సరఫరాలో అంతరాయాలు లేకుండా ప్రత్యామ్నాయ విద్యుత్ లైన్లు వేస్తున్నాం. ఏదేని సబ్‌స్టేషన్‌లో సమస్య ఉత్పన్నమైనప్పుడు, మరమ్మతులు చేసినప్పుడు, అప్‌గ్రేడ్ పనులు జరిగినప్పుడు విద్యుత్ కోతలు ఉండకుండా ప్రత్యామ్నాయ లైన్ల ద్వారా విద్యుత్ సరఫరా చేస్తున్నాం.

– జి.సాంబ రెడ్డి, హనుమకొండ టౌన్ డీఈ

న్యాయబద్ధంగా వర్గీకరణ చేపట్టాలి

- లంబాడీ హక్కుల పోరాట సమితి జాతీయ అధ్యక్షుడు దాస్ రామ్‌నాయక్

నర్సంపేట: ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్ల వర్గీకరణను న్యాయబద్ధంగా చేపట్టి అన్ని వర్గాలకు సమన్యాయం చేయాలని లంబాడీ హక్కుల పోరాట సమితి జాతీయ అధ్యక్షుడు దాస్ రామ్‌నాయక్ డిమాండ్ చేశారు. ఈ మేరకు నర్సంపేట పట్టణంలోని సిద్దార్థ డిగ్రీ కళాశాలలో ఆదివారం మానవ హక్కుల వేదిక 10వ జిల్లా మహాసభ ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షుడు అద్దనూరి యాదగిరి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ వచ్చిన తర్వాత రాష్ట్రంలో విచిత్ర పరిస్థితి నెలకొందన్నారు. రాష్ట్రంలో అధికార పక్షం, విపక్షం ఉన్నా ప్రజాపక్షమే లేదని దుయ్యబట్టారు. ప్రజా పక్షం మాట్లాడే వారందరినీ ప్రభుత్వాలు బెదిరించి తమ పక్షాల్లో చేర్చుకుని ప్రజలకు ఒక గొంతుక లేకుండా చేస్తున్నాయని వాపోయారు. మానవ హక్కుల వేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఎస్.తిరుపతయ్య మాట్లాడుతూ ఈ ప్రాంత ప్రజల కీలక సమస్య రంగయ్య చెరువును రిజర్వాయర్‌గా మార్చే ప్రక్రియను వెంటనే మానుకోవాలని డిమాండ్ చేశారు. రంగయ్య చెరువు రిజర్వాయర్ వ్యతిరేక పోరాట కమిటీ నాయకుడు గూబ రాజు మాట్లాడుతూ ఎవరూ కోరుకోని.. ఎవరికీ ఇష్టం లేని ప్రాజెక్టును ఎందుకు చేపడుతున్నారో అర్థం కావడం లేదన్నారు. తెలంగాణ విద్యావంతుల వేదిక రాష్ట్ర ఉపాధ్యక్షుడు డాక్టర్ పి.జగదీశ్వర్, తుడుందెబ్బ రాష్ట్ర అధ్యక్షుడు వట్టం ఉపేందర్ మాట్లాడుతూ రెండు దశాబ్దాలుగా అభివృద్ధి అంటే రోడ్లను విస్తరించడం, అవసరం లేకపోయినా ప్రాజెక్టులను నిర్మించడం, ప్రైవేట్ సంస్థలకు బలవంతంగా ప్రజల నుంచి భూములను లాక్కొని కట్టబెట్టడమేనన్నారు. గత ప్రభుత్వం మల్లన్న సాగర్ లాంటి ప్రాజెక్టుల కోసం బలవంతంగా ఊళ్లకు ఊళ్లను ముంచి ప్రజలను దిక్కులేని వాళ్లను చేసిన భయంకరమైన జ్ఞాపకాలను ప్రజలు మరచిపోలేదన్నారు. ఇక ఇలాంటి బలవంతపు భూసేకరణలు ఆగిపోతాయని ఆశిస్తూ ఎన్నుకున్న కొత్త ప్రభుత్వం కూడా అదే బాటలో నడవడం లగచర్లలో రుజువైందన్నారు. ఇలాంటి అభివృద్ధి నమూనాను ప్రభుత్వాలు వెంటనే మానుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు బాదావత్ రాజు, రాష్ట్ర కార్యదర్శి టి.హరికృష్ణ, జిల్లా ప్రధాన కార్యదర్శి వి.దిలీప్, కార్యదర్శులు జి.పద్మజ, పి.శ్రీనివాస్, సభ్యులు ఎ.శ్రీనివాస్, వి.వెంకటనారాయణ, పొన్నాల రమేశ్, కర్ణాటక సమ్మయ్య, ఉయ్యాల సురేందర్, గణేశ్, రంగయ్య చెరువు పోరాట కమిటీ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న దాస్ రామ్‌నాయక్

30న న్యాయవాదుల సంఘం రాష్ట్ర మహాసభలు

హన్మకొండ : హనుమకొండలో ఈనెల 30, డిసెంబర్ 1వ తేదీల్లో భారత న్యాయవాదుల సంఘం తెలంగాణ రాష్ట్ర ద్వితీయ మహాసభలు నిర్వహించనున్నట్లు సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి బొమ్మగాని ప్రభాకర్ తెలిపారు. ఆదివారం హనుమకొండ నక్కలగుట్టలోని హరితకాకతీయ హోటల్‌లో భారత న్యాయవాదుల సంఘం సన్నాహక సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ప్రభాకర్ మాట్లాడుతూ దేశ రాజ్యాంగ మౌలిక లక్ష్యాల అమలు, న్యాయవ్యవస్థలో న్యాయవాదుల, లా విద్యార్థుల భవిష్యత్, సామాజిక న్యాయ లక్ష్యాలు వంటి అంశాలతో ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ లాయర్స్ సంఘాన్ని స్థాపించినట్లు వివరించారు. నేడు దేశం, రాష్ట్రంలో న్యాయవాదులపై దాడులు, హత్యలు పెరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. న్యాయవాదులకు రక్షణ చట్టాన్ని అమలు చేయాల్సిన అవసరముందన్నారు. మహాసభ ఆహ్వాన సంఘం చైర్మన్, రాష్ట్ర బార్ కౌన్సిల్ సభ్యుడు దుస్సా జనార్దన్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో ఆహ్వాన సంఘం ప్రధాన కార్యదర్శి భీమనాదం శ్రీనివాస్, ప్రతినిధులు ప్రేమ్‌సాగర్‌రావు, సుధీర్, బిల్లా ప్రభాకర్, గంజి గణేశ్, వల్లీఉల్లాఖాద్రీ, కొత్తపల్లి చిరంజీవి, మెరుగు సుభాష్, సత్యనారాయణ, దిలీప్, భానుకార్తీక్, కృష్ణ ప్రసాద్ పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఆహ్వాన కమిటీ ప్రతినిధులు

డిగ్రీ పరీక్షలపై అయోమయం

- వెబ్‌సైట్‌లో 138 కళాశాలల విద్యార్థుల హాల్‌టికెట్‌లు మాత్రమే..
- కనిపించని ఫీజులు చెల్లించని కళాశాలలకు సంబంధించిన హాల్‌టికెట్లు
- నేడు ప్రైవేట్ యాజమాన్యాలు వీసీని కలిసే అవకాశం

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీ పరిధి ఉమ్మడి వరంగల్, ఖమ్మం, ఆదిలాబాద్ జిల్లాలోని డిగ్రీ బీఏ, బీకాం, బీఎస్సీ, బీబీఏ, బీసీఏ మొదటి, మూడో, ఐదవ సెమిస్టర్ల పరీక్షల నిర్వహణపై అయోమయం నెలకొంది. ఈనెల 26 నుంచి పరీక్షలు నిర్వహిస్తామని అధికారులు చెబుతున్నా.. పరీక్షలు వాయిదా వేయాల్సిందేనని ప్రైవేట్ డిగ్రీ, పీజీ కళాశాలల యాజమాన్యాలు యూనివర్సిటీ అధికారుల దృష్టికి తీసుకెళ్లాయి. తమకు ప్రభుత్వం ఫీజురీయింబర్స్‌మెంట్ చెల్లించడం లేదని, దీంతో తాము ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామన్నారు. ఈ నేపథ్యంలో యూనివర్సిటీకి ఫీజులు కూడా చెల్లించే పరిస్థితి లేదంటున్నారు.

పరీక్షల వాయిదాకు ససేమిరా అంటున్నా నిర్వహించే పరిస్థితి ఏదీ!

పరీక్షలు వాయిదా వేసే పరిస్థితి లేదని కేయూ రిజిస్ట్రార్ మల్లారెడ్డి, పరీక్షల నియంత్రణాధికారి నర్సింహాచారి తెలుపుతున్నా ఆదివారం వరకు విద్యార్థులకు హాల్‌టికెట్లు అందలేదు. యూనివర్సిటీ పరిధిలో 290 వరకు అన్ని యాజమాన్యాలు కలిపి డిగ్రీ కళాశాలలుండగా ఆదివారం వరకు కేవలం 138 కళాశాలలకు సంబంధించిన విద్యార్థుల హాల్‌టికెట్లు సంబంధిత కేయూ వెబ్‌సైట్‌లో అంటే కళాశాలలు లాగిన్ అయి హాల్‌టికెట్లు డౌన్‌లోడ్ చేసుకొని విద్యార్థులకు ఇవ్వాల్సింటుంది. ప్రభుత్వ, గురుకుల కళాశాలలు డౌన్‌లోడ్ చేసుకుంటున్నప్పటికీ ప్రైవేట్ కళాశాలలు యూనివర్సిటీకి వివిధ ఫీజులు చెల్లించకపోవడంతో వారి హాల్‌టికెట్లు సంబంధిత వెబ్‌సైట్‌లో అందుబాటులో పెట్టలేదని తెలుస్తోంది. ఎవరైతే ఫీజులు చెల్లించారో ఆ ప్రైవేట్ కళాశాలల హాల్‌టికెట్లు అందుబాటులో ఉంచినా వారు కూడా డౌన్‌లోడ్ చేసుకోవడం లేదు. యూనివర్సిటీకి ఫీజు చెల్లించకపోతే వారికి హాల్‌టికెట్లు జారీచేయొద్దని రిజిస్ట్రార్ మల్లారెడ్డి పరీక్షల విభాగం అధికారులను ఆదేశించారని సమాచారం. ఈ నేపథ్యంలో ఈపరీక్షలు ఈనెల26నుంచి నిర్వహించడం సాధ్యం కాదనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

నేడు వీసీని కలవనున్న యాజమాన్యాలు

ప్రైవేట్ డిగ్రీ, పీజీ కళాశాల యాజమాన్యాల అసోసియేషన్ బాధ్యులు సోమవారం కాకతీయ యూనివర్సిటీ వీసీ ప్రతాప్‌రెడ్డిని కలవబోతున్నారు. ఈనెల26 నుంచి తాము పరీక్షల నిర్వహణకు సిద్ధంగా లేమని, కనీసం వారం రోజులు వాయిదా వేయాలని కోరబోతున్నట్లు సమాచారం. కాగా, డిగ్రీ మొదటి సెమిస్టర్ పరీక్షలు 68,270 మంది, మూడో సెమిస్టర్ 58,630 మంది, ఐదో సెమిస్టర్ 45,853 మంది విద్యార్థులు పరీక్షలు రాయాల్సి ఉంది.

సాయిబాబా ఆశయాలను కొనసాగించాలి

- సంస్మరణ సభలో ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి


మాట్లాడుతున్న ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి

కేయూ క్యాంపస్: ప్రొఫెసర్ సాయిబాబా ఆశయాలు కొనసాగించాలని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి అన్నారు. ప్రజాస్వామిక, వామపక్ష, లౌకిక వాదుల ప్రజాసంఘాల ఐక్యవేదిక ఉమ్మడి వరంగల్ జిల్లా ఆధ్వర్యంలో ఆదివారం హనుమకొండలోని యూనివర్సిటీ ఆర్ట్స్‌అండ్ సైన్స్ కాలేజీలో ఘంటా రాంరెడ్డి అధ్యక్షతన జరిగిన ఢిల్లీ యూనివర్సిటీ ప్రొఫెసర్ సాయిబాబా సంస్మరణ సభలో ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. ఇతరులకు మంచి చేయాలనే ఉద్దేశంతోనే ముందుకెళ్తున్న సాయిబాబాది మాములు మరణం కాదని, కార్పొరేట్ శక్తులకు వత్తాసుపలికే ప్రభుత్వమే సాయిబాబాను హత్యచేసిందని భావిస్తున్నామన్నారు. వీక్షణం ఎడిటర్ ఎన్. వేణుగోపాల్ మాట్లాడుతూ సాయిబాబా జీవితమే పోరాట సందేశమన్నారు.ఆయన ఎప్పుడు విప్లవోద్యమ పక్షాన ఉండిపోరాటం చేశారన్నారు. కేయూ రిటైర్డ్ ప్రొఫెసర్ కాత్యాయనీవిద్మహే మాట్లాడుతూ పుట్టుక నీది చావునీది బతుకంతా దేశానిది అన్న కాళోజీ మాటలు సాయిబాబాకు అక్షరాల వర్తిస్తాయని అభిప్రాయపడ్డారు. ప్రొఫెసర్ సాయిబాబా కూతురు మంజీరా మాట్లాడుతూ నాన్న జైలులో ఉన్నప్పుడు తనకు ఎప్పుడు ఉత్తరం రాసినా ధైర్యం వచ్చేదన్నారు. సామాజిక విశ్లేషకుడు రవిచందర్.. సాయిబాబా బాల్యం, విద్యాభ్యాసం, ఉద్యమ జీవితాన్ని వివరించారు. డీటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లింగారెడ్డి, లాల్‌నీల్‌మైత్రి వేదిక రాష్ట్ర నాయకుడు మార్క శంకర్‌నారాయణ, ఆర్గనైజింగ్ సెక్రటరీ వెంగళరెడ్డి, భారత్‌బచావో హనుమకొండ జిల్లా చైర్మన్ సిద్ధోజు రామబ్రహ్మం, పౌరహక్కుల సంఘం వరంగల్ జిల్లా అధ్యక్షుడు రమేశ్ చంద్ర, తదితరులు పాల్గొన్నారు.

సీఎంతో మాట్లాడి న్యాయం చేస్తాం

- ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావ్

వాజేడు: మావోయిస్టుల చేతిలో హత్యకు గురైన ఉయికె రమేశ్, ఉయికె అర్జున్ కుటుంబాలకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో మాట్లాడి న్యాయం చేస్తానని భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావ్ భరోసా ఇచ్చారు. ములుగు జిల్లా వాజేడు మండల పరిధి పెనుగోలు కాలనీకి ఆదివారం వచ్చిన ఆయన బాధిత కుటుంబాలను ఓదార్చారు. జరిగిన సంఘటన గురించి రమేశ్ భార్య రాంబాయి, అర్జున్ భార్య సావిత్రిని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వారితో ఎమ్మెల్యే మాట్లాడుతూ ఇరు కుటుంబాలకు అండగా ఉంటామని, ప్రభుత్వం నుంచి వచ్చే ఆర్థిక సహాయాన్ని త్వరలో ఇప్పిస్తామని హామీ ఇచ్చారు. ఇరు కుటుంబాల్లో ఒక్కొక్కరికి ప్రభుత్వ ఉద్యోగం వచ్చేలా చూస్తామని చెప్పారు. ప్రస్తుత అవసరాల నిమిత్తం కొంత నగదును ఆయన అందజేశారు. ఎమ్మెల్యే వెంట కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు దంతులూరి విశ్వనాథ ప్రసాద్‌రాజు, ములుగు జిల్లా ప్రధాన కార్యదర్శి కాకర్లపూడి విక్రాంత్, సాయి కల్యాణ్, ఖాజావలీ, కాళీ, ఎల్లయ్య, రాంబాబు తదితరులున్నారు.


బాధిత కుటుంబాలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వెంకట్రావ్

ఖమ్మానిదే నెట్‌బాల్ ట్రోఫీ..

- బాల,బాలికల విభాగంలో ప్రథమస్థానం సాధించిన జట్లు
- ద్వితీయ స్థానాల్లో నల్లగొండ, వరంగల్ జిల్లాల జట్లు
- కల్వలలో ముగిసిన రాష్ట్రస్థాయి పోటీలు

కేసముద్రం: మహబూబాబాద్ జిల్లా కేసముద్రం మండలం కల్వల గ్రామ జెడ్పీహైస్కూల్‌లో నిర్వహించిన 68వ ఎస్‌జీఎఫ్ రాష్ట్రస్థాయి బాల, బాలికల(అండర్ -17) నెట్‌బాల్ పోటీలు ఆదివారం ముగిశాయి. ఈ పోటీల్లో బాలికల విభాగంలో ఖమ్మం జట్టు ప్రథమస్థానంతో నిలిచింది. నల్లగొండ ద్వితీయస్థానం, వరంగల్ తృతీయస్థానంలో నిలిచాయి. బాలుర విభాగంలో ఖమ్మం జట్టు ప్రథమ స్థానంలో నిలిచింది. వరంగల్ ద్వితీయ స్థానం, నల్లగొండ తృతీయస్థానంలో నిలిచాయి. మహబూబాబాద్ డీఎస్పీ తిరుపతిరావు, కేసముద్రం మార్కెట్ చైర్మన్ గంట సంజీవరెడ్డి.. విజేతలకు మెడల్స్, షీల్డ్‌లు అందజేశారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ విద్యార్థి దశ నుంచే చదువుతోపాటు, క్రీడలపై శ్రద్ధ వహించాలన్నారు. అనంతరం ఇదే పాఠశాల ఆవరణలో ఎస్‌జీఎఫ్ రాష్ట్రస్థాయి గట్కా పోటీలను ప్రారంభించారు. కార్యక్రమంలో ఎస్సై మురళీధర్‌రాజు, కేసముద్రం సొసైటీ వైస్ చైర్మన్ అంబటి మహేందర్ రెడ్డి, డీవైఎస్‌ఓ జ్యోతి, ఎస్‌జీఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి సత్యనారాయణ, గట్కా స్టేట్ సెక్రటరీ విశాల్‌సింగ్, హెచ్ఎంలు బండారు నరేందర్, కల్లెం వీరారెడ్డి, బండారు వెంకన్న, పీడీలు, టోర్నమెంట్ నిర్వాహకులు, కోచ్‌లు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


ఖమ్మం బాలికల జట్టుకు ప్రథమ బహుమతి అందజేస్తున్న డీఎస్పీ, మార్కెట్ చైర్మన్

క్రికెట్ విజేత వాగ్దేవి కళాశాల

- రన్నరప్‌గా ఆర్ట్స్ అండ్ సైన్స్ కాలేజీ
- ముగిసిన ఇంటర్ కాలేజీయెట్ పోటీలు

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీలోని క్రీడా మైదానంలో ఇంటర్ కాలేజీయెట్ క్రికెట్‌పోటీలు(పురుషుల) ఆదివారం ముగిశాయి. ఫైనల్‌లో వాగ్దేవి డిగ్రీ కళాశాల, యూనివర్సిటీ ఆర్ట్స్‌అండ్ సైన్స్ కాలేజీ జట్లు తలపడ్డాయి. ఇందులో వాగ్దేవి డిగ్రీ కళాశాల గెలుపొందగా ఆర్ట్స్‌అండ్ సైన్స్ కాలేజీ రన్నరప్‌గా నిలిచింది. కేయూ రిజిస్ట్రార్ పి. మల్లారెడ్డి విజేతలకు బహుమతులు అందజేశారు.ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు చదువుతోపాటు తమకు ఇష్టమైన క్రీడలపై ఆసక్తి పెంచుకుని రాణించాలన్నారు. కార్యక్రమంలో కేయూ స్పోర్ట్స్‌బోర్డు సెక్రటరీ ఆచార్య వెంకయ్య, వాగ్దేవి డిగ్రీ, పీజీ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ పి. హరెందర్‌రెడ్డి, కొమురారెడ్డి, ఆర్గనైజింగ్ సెక్రటరీ మహ్మద్ అఫ్జల్, ఫిజికల్ డైరెక్టర్లు డాక్టర్ భాస్కర్, మధుకర్, పల్లెపు కిషన్, బత్తిని జీవన్, మోహనకృష్ణ, మట్టెడ కుమార్, అస్లాం పాల్గొన్నారు. ఎంపైర్లుగా ప్రభాకర్, వేల్పుల సురేశ్ వ్యవహరించారు. కాగా, క్రీడాకారులను వాగ్దేవి డిగ్రీ, పీజీ కళాశాల సెక్రటరీ, కరస్పాండెంట్ చందుపట్ల దేవేందర్‌రెడ్డి, ప్రిన్సిపాల్ శేషాచలం అభినందించారు.


వాగ్దేవి కళాశాల జట్టుకు బహుమతి అందజేస్తున్న రిజిస్ట్రార్ మల్లారెడ్డి తదితరులు

హెచ్‌ఎంలకు బోధనేతర పనులు అప్పగించొద్దు

- హెచ్‌ఎంల అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు చంద్రప్రకాశ్


రవీందర్


సుధాకర్‌రావు

విద్యారణ్యపురి: ప్రభుత్వ ఉన్నత పాఠశాలల హెచ్‌ఎంలకు బోధనేతర పనులు అప్పగించొద్దని, వివిధ కారణాలతోఏకపక్షంగా సస్పెన్షన్‌లు చేయొద్దని తెలంగాణ గెజిటెడ్ హెచ్‌ఎంల అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు పి. రాజభాను చంద్రప్రకాశ్ డిమాండ్ చేశారు. ఆదివారం హనుమకొండలోని ప్రభుత్వప్రాక్టిసింగ్ పాఠశాలలో నిర్వహించిన సంఘం సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. మధ్యాహ్నం భోజన నిర్వహణ, డీఎస్సీ అభ్యర్థుల సర్టిఫికెట్ల తనిఖీ విషయంలో హెచ్‌ఎంలను బాధ్యులను చేయడం సరికాదన్నారు. అనంతరం వరంగల్ జిల్లాశాఖ నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ఎస్. రవీందర్, ప్రధాన కార్యదర్శిగా ఎల్. సుధాకర్, కోశాధికారిగా మహేశ్, రాష్ట్ర కౌన్సిలర్లుగా జి. కృష్ణమూర్తి, బి.పరమేశ్వర్ ఎన్నికయ్యారు. మాజీ జిల్లా అధ్యక్షుడు రాజాక్, ప్రధాన కార్యదర్శి సదా శివరావు నివేదిక సమర్పించారు. ఈ సమావేశంలో సీనియర్ హెచ్‌ఎం పట్టాభి, జిల్లా సైన్స్‌అధికారి కట్ల శ్రీనివాస్, గెజిటెడ్ హెచ్‌ఎంల సంఘం హనుమకొండ జిల్లాశాఖ అధ్యక్షుడు రామకృష్ణ, ప్రధాన కార్యదర్శి నెహ్రూ తదితరులు పాల్గొన్నారు.

బైక్ అదుపు తప్పి యువకుడి మృతి


రాంబాబు (ఫైల్)

రఘునాథపల్లి: బైక్ అదుపు తప్పిన ఘటనలో ఓ యువకుడు మృతి చెందాడు. ఈ ప్రమాదం జనగామ మండలం యశ్వంతాపూర్ బీఫార్మసీ కళాశాల ఎదుట జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. జనగామ జిల్లా రఘునాథపల్లి మండలం గబ్బెట గ్రామానికి చెందిన రంగు యాదగిరి, ఆల్య దంపతుల కుమారుడు రాంబాబు (28) ట్రాలీలో అంగన్‌వాడీ కేంద్రాలకు కోడి గుడ్లు సప్లయ్ చేస్తుంటాడు. శనివారం పనులు ముగించుకుని తన ద్విచక్రవాహనంపై రాత్రి 9 గంటల సమయంలో ఇంటికి బయలుదేరాడు. యశ్వంతాపూర్ బీఫార్మసీ కళాశాల వద్దకు చేరుకున్న సమయంలో బైక్ అదుపు తప్పి కిందపడ్డాడు. దీంతో తీవ్ర గాయాలు కావడంతో స్థానికులు గుర్తించి 108లో జనగామ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా వైద్యులు పరీక్షించి మృతి చెందినట్లు నిర్ధారించారు. ఈ ఘటనపై మృతుడి సోదరుడు రాజు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు జనగామ పోలీసులు తెలిపారు. కాగా, మాజీ ఎమ్మెల్యే తాటికొండ రాజయ్య ఆదివారం గబ్బెట గ్రామానికి చేరుకుని రాంబాబు మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు.

రోడ్డు ప్రమాదంలో వృద్ధుడు..

దుగ్గొండి : రోడ్డుపై నడుచుకుంటూ వెళ్తున్న వృద్ధుడిని వెనక నుంచి ద్విచక్రవాహనం ఢీకొట్టడంతో వృద్ధుడు మృతిచెందిన సంఘటన మండలంలోని గిర్నిబావిలో జరిగింది. నర్సంపేట మండలం ముత్తోజీపేటకు చెందిన బోళ్ల ఐలయ్య(80) దుగ్గొండి మండలం గిర్నిబావిలోని తన కూతురు జయమ్మ ఇంటికి శనివారం వచ్చాడు. ఆదివారం గిర్నిబావి నుంచి ముత్తోజీపేటకు బయలుదేరాడు. ఈ క్రమంలో గిర్నిబావి నుంచి నడుచుకుంటూ వెళ్తున్న ఐలయ్యను వరంగల్ నుంచి వస్తున్న గుర్తు తెలియని ద్విచక్ర వాహనం ఢీకొట్టి వెళ్లిపోయింది. దీంతో అతడికి తీవ్ర గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం ఎంజీఎంకు తరలించగా మృతి చెందాడు. ద్విచక్ర వాహనదారుడి వివరాలు తెలియరాలేదు. మృతుడికి భార్య, ఐదుగురు కుమార్తెలు ఉన్నారు.

లారీ సప్లయర్స్ సంక్షేమమే ధ్యేయం

- నూతన అధ్యక్షుడు వంగల సమ్మిరెడ్డి

ఖిలా వరంగల్: ది వరంగల్ జిల్లా లారీ సప్లయర్స్ అసోసియేషన్ సభ్యుల సంక్షేమమే ధ్యేయంగా కృషి చేస్తానని నూతన అధ్యక్షుడు వంగల సమ్మిరెడ్డి హామీ ఇచ్చారు. ఆదివారం వరంగల్ ఆర్టీఏ సమీపంలోని ఉమ్మడి జిల్లా లారీ సప్లయర్స్ అసోసియేషన్ భవనంలో ఇటీవల నూతనంగా ఎన్నికైన కార్యవర్గం ప్రమాణ స్వీకారం చేసింది. అధ్యక్షుడు వంగల సమ్మిరెడ్డి, ప్రధాన కార్యదర్శి కొండ సత్యనారాయణ, కోశాధికారి దాసరి నాగరాజు, ఉపాధ్యక్షుడు సయ్యద్ హిమాయతుల్లా(బాబర్), సహాయ కార్యదర్శి మందాటి రవీందర్, సభ్యులు బాసాని రామకృష్ణ, తాళ్లకుమార్ ప్రమాణం చేశారు. అనంతరం సమ్మిరెడ్డి మాట్లాడుతూ.. నిరంతరం సభ్యులకు అందుబాటులో ఉంటూ వారి అభ్యున్నతికి పాటుపడతానని అన్నారు. కార్యక్రమంలో ఎన్నిక అధికారులు, అడ్‌హక్ కమిటీ ప్రతినిధి మింగని సదానందం, తోట దేవేందర్, వెలిశాల శ్రీనివాస్, కందిమల్ల భాస్కర్‌రావు, ఇంజమూరి సూర్యనారాయణ తదిరులు పాల్గొన్నారు.


ప్రమాణ స్వీకారోత్సవంలో నూతన కార్యవర్గాన్ని సన్మానిస్తున్న సప్లయర్స్ సభ్యులు